మృగశిర సందడి

హుస్నాబాద్‌టౌన్: మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు

సిద్దిపేటలో ఇంగువబెల్లం పంపిణీ చేస్తున్న సిబ్బంది

చేపలకోసం ఎగబడ్డ జనం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 8: హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం భారీగా చేపల విక్రయాలు జరిగాయి. స్థానిక పాత రెవెన్యూ కార్యాలయంలోని చేపల మార్కెట్‌కు ఉదయం నుంచే ప్రజలు చేపలు కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. మృగశిర కార్తె రోజు చేపలు తింటే ఆస్తమాలాంటి పలు వ్యాధులు దూర మవుతాయనే నమ్మకం ప్రజల్లో ఉంది. దీంతో ప్రజలు చేపలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు.

రైతు బజార్‌లో ఇంగువబెల్లం పంపిణీ

సిద్దిపేట/సిద్దిపేట టౌన్, జూన్ 8:మృగశిర కార్తెను పురస్కరించుకొని సిద్దిపేటలోని మోడల్ రైతు బజారులో సామాజిక కార్యకర్త గౌస్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం రైతులు, వినియోగదారులకు ఇంగువ బెల్లం మందు ఉచితంగా అందజేశారు. సుమారు 500 మందికి ఈ ఇంగువబెల్లం వితరణ చేశారు. ఈ సందర్భంగా రైతుబజార్ ఎస్టేట్ అధికారి ప్రభాకర్ తో కలిసి గౌస్‌బాబా మాట్లాడుతూ 15ఏండ్లుగా సుభాష్ రోడ్డులోని దర్గా వద్ద ఇంగువబెల్లం పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రైతు బజారులో మృగశిర కార్తె రోజు ఉచితంగా ఇంగువబెల్లం పంపిణీ చేస్తామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జనగామ ఎమ్మెల్యే పల్లా ఇంట శుభకార్యం

ఎమ్మెల్యే పల్లా,ఆయన సతీమణి నీలిమా, కుమారుడు అనురాగ్, చేర్యాల ప్రాంత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

చేర్యాల, జూన్ 8 : జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ఇంట జరిగిన శుభకార్యానికి చేర్యాలటౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలివెళ్లారు. జన్‌వాడలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి కుమారుడు అనురాగ్ డాక్టర్ సంజన దంపతుల కుమార్తె ఆద్య నామకరణోత్సవం ఆదివారం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపుమేరకు పార్టీ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లి చిన్నారిని ఆశీర్వదించారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటికి నివాళి

హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,జూన్8: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎమ్మెల్యే మాగంటి కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మా గంటి మరణం తీరని లోటు

చేర్యాల, జూన్ 8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మాగంటి గోపీనాథ్ మృతికి సంబంధించి ఎమ్మెల్యే పల్లా ఆదివారం ప్రకటన విడుదల చేశారు.హైదరాబాద్ రాజకీయాల్లో ఒక విలక్షణమైన స్థానాన్ని సంపాదించుకున్న మాగంటి నియోజకవర్గ ప్రజల కోసం ఎప్పుడు తపించే వాడన్నారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశాడన్నారు.మాగంటి మృతి పార్టీకే కాకుండా హైదరాబాద్ ప్రజలకు పెద్ద నష్టమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మాగంటి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆయన కుటుంబానికి దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

అమ్మవారి దర్శనానికి బారులు

రేణుకా ఎల్లమ్మ దర్శనానికి క్యూలో వేచి ఉన్న వందలాది మంది భక్తులు

హుస్నాబాద్‌టౌన్, జూన్8: హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మదర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జాతర గత నెల 12వతేదీన ప్రారంభమై దాదాపు ఇరవై ఏడురోజులు గడుస్తున్నా భక్తుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతూనేఉన్నది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు గంటలతరబడి క్యూలో వేచి ఉన్నారు. సాధారణ దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనం క్యూ సైతం భక్తులతో నిండిపోయింది. ఆదివారం దాదాపు పదివేల మందికిపైగా భక్తులు తరలి వచ్చినట్లు ఆలయ అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో పట్నాలు వేయడం, ఒడిబియ్యం చీర, గాజులు సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న దంపతులు

హుస్నాబాద్ రేణుకాఎల్లమ్మ తల్లిని ఆదివారం సాయంత్రం సౌత్‌సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డీఎస్‌టీఈ అధికారి పూదరి మనీషామనోజ్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, గీతపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పూదరి వరప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు పచ్చిమట్ల రాధ, ముప్పిడి రాజిరెడ్డి, అర్చకుడు పరమేశ్వర్ పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో డొనేషన్ కౌంటర్ ప్రారంభం

మల్లన్న క్షేత్రంలో డొనేషన్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఈవో అన్నపూర్ణ

చేర్యాల, జూన్ 8 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం ఆలయ ఈవో అన్నపూర్ణ డొనేషన్ కౌంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డొనేషన్ కౌంటర్‌లో స్వామి వారి ప్రతిమ, నాణాలు, స్వామి వారికి ఇచ్చే విరాళాలు, శాశ్వత పూజలు, కల్యాణాలు, శాశ్వత నిత్యాన్నదాన పథకం విరాళాలు, దేవాలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు అందజేసేందుకు కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రత్యేకంగా డొనేషన్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.స్వామి వారి ఆలయ అభివృద్ధి, భక్తుల వసతుల కోసం విరాళాలు అందజేసే దాతలు కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ధ శ్రీనివాస్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, పాలక మండలి సభ్యులు శ్రీనివాస్, అంజిరెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున్, స్థానాచార్యులు మల్లయ్య, అర్చకులు మనోహర్, సూర్యకుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

దేవతల దీవెనలతో ప్రజలు చల్లగా ఉండాలి

మోతెలో చౌడాలమ్మ దేవి ఉత్సవాల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జూన్ 8 : గ్రామ దేవతల దీవెనలతో ప్రజలు చల్లగా ఉండాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో చౌడాలమ్మదేవి అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉండాలని దేవతల కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, రంజిత్, యాదవ కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలు

అక్కన్నపేట, జూన్ 8: మండలంలోని గౌరవెల్లికి చెందిన బైరగొని రవి అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజు వారిగా ఊరు సమీపంలోని తాటివనంలో ఆదివారం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి, చికిత్స నిమిత్తం దవాఖానకు తీసుకువెళ్లారు. గీత కార్మిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'మల్లన్న' క్షేత్రంలో భక్తుల రద్దీ

చేర్యాల, జూన్ 8 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. వేసవి సెలవులు ముగింపు దశకు రావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు.కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారిని సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరికొందరు భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు,కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు.ఆలయ ఈవో అన్నపూర్ణ, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సిబ్బంది, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి,సిబ్బంది, అర్చకులు,ఒగ్గు పూజారులు, భక్తులకు సేవలందించారు.



గంగరేగు చెట్టు ఆవరణలో భక్తుల సందడి

గౌరవెల్లితో సస్యశ్యామలం చేస్తా

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్: రైతుమహోత్సవం ముగింపులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 8: హుస్నాబాద్ ప్రాంతాన్ని గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా సస్యశామలం చేసేందుకు కృషిచేస్తానని బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్‌లో మూడురోజుల నుంచి జరుగుతున్న రైతుమహోత్సవం సమావేశం ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ఫోన్ ద్వారా రైతాంగానికి తన సందేశం వినిపించారు. ఈ ప్రాంతం వ్యవసాయంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషిచేస్తానన్నారు. మూడురోజులు నిర్వహించిన రైతుమహోత్సవం జిల్లాలోని రైతులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రైతులకు ఉపయోగపడే యాంత్రీకరణ, నూతన వంగడాలు, ఆయిల్‌పామ్‌సాగు, కోళ్లపెంపకం తదితర ఉత్పత్తులపై సాంకేతిక, యాంత్రీకరణ అంశాలను రైతాంగం తెలుసుకున్నారని మంత్రి చెప్పారు. తెలంగాణలోనే హుస్నాబాద్ రైతులు ఆదర్శంగా ఉండాలని కోరుకుంటున్నానని, మృగశిరకార్తెలో అధిక వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. క్యాబినెట్ విస్తరణతోపాటు పలు అంశాల వల్లతాను సమావేశానికి రాలేకపోయానని ఆయన వివరించారు. కలెక్టర్ ఎం. మనుచౌదరి మాట్లాడుతూ నాలుగు జిల్లాల రైతాంగానికి అనువైన ప్రాంతంగా హుస్నాబాద్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. వ్యవసాయంలో కొత్తమార్పులు, పంటల మార్పులపై రైతులు రైతుమహోత్సంద్వారా అవగాహన పెంచుకున్నారని చెప్పారు. మహారాష్ట్రలో అరటి సాగుకు వాతావారణం అనుకూలించకపోయినా బిందుసేద్యంద్వారా విజయం సాధించారని ఆయన వివరించారు. వాతావరణం అనుకూలంగా లేకున్నా, ఆర్థికంగా లేకున్నా ఆలోచనలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అనేక ప్రాంతాల రైతులు నిరూపించారన్నారు. చేపలపెంపకం, గేదెలు, అవుల పెంపకంద్వారా వాటివ్యర్థాలను వినియోగించుకుని పంటల దిగుబడిని పెంచుకునే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తించాలని ఆయన చెప్పారు. సేంద్రియ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, ఎరువులు తగ్గించడం, పంటదిగుబడిని పెంచుకునేందుకు ఇలాంటి మేళాలు రైతాంగానికి మేలుచేస్తాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ కేడం లింగమూర్తి, వ్యవసాయ మార్కెట్‌కమిటీచైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తోపాటు పలువురిని ఘనంగా సన్మానించారు.

ప్రజలకు అండగా డీబీఎఫ్

మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట టౌన్, జూన్ 8 :ప్రజలకు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) అండగా నిలుస్తుందని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.దళిత బహుజన ఫ్రంట్ జిల్లా మహాసభ సిద్దిపేటలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి డీబీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పిస్తూ సమాజమార్పునకు కృషి చేస్తున్నదని కొనియాడారు. ప్రజలకు,ప్రభుత్వాలకు డీబీఎఫ్ వారధిగా పనిచేస్తుందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం డీబీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.అంతకు ముందు డీబీఎఫ్ నేత శంకర్ పుట్టిన రోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.కార్యక్రమంలో మెట్ల శంకర్, స్వామి, సంజీవ్ భీమ్ శేఖర్, సతీశ్, పోతురాజు, శంకర్, వేణు, కిరణ్, తిరుపతి, రాములు, ఆనంద, పరశురాములు, మైసయ్య, దశరథ పాల్గొన్నారు.

చెలిమి ఫౌండేషన్ చేయూత

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

గజ్వేల్, జూన్ 8: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. మండల పరిధిలోని కొడకండ్ల గ్రామానికి చెందిన తలారి కరుణాకర్ కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం చెలిమి ఫౌండేషన్ సభ్యులు రూ.11,500 నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్, సభ్యులు శ్రీనివాస్, రమేశ్, నర్సింహులు, ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మద్దూరు మండలంలోని రేబర్తి హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం బి. చంద్రభాను అన్నారు. ఆదివారం రేబర్తి గ్రామంలో బడిబాట నిర్వహించారు. ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యబోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. టీచర్లు శిరీష, మల్లేశం, రఫత్, ఉమర్, ప్రశాంత్, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మిరుదొడ్డి: ఎల్లారెడ్డిపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మిరుదొడ్డి, జూన్ 8 : తొగుట మండలం ఎల్లారెడ్డిపేట జడ్పీ పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 8: ధూళిమిట్ట ఉన్నత పాఠశాలలో 1984-85లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 40 ఏండ్ల క్రితం పాఠశాలను వదలివేసిన సుమారు 50మంది పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు.

మద్దూరు: ఆత్మీయ సమ్మేళనంలోపాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముతన్నపేటలో బొడ్రాయి ప్రతిష్ఠ

బొడ్రాయి ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్తులు

బెజ్జంకి, జూన్ 8: మండలంలోని ముత్తన్నపేటలో బొడ్రా యి ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూరోహితులు బొడ్రాయి ప్రతిష్ఠాపన, బోనాలు, ఒడిబియ్యం, గ్రామ బలి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కు లు చెల్లించుకున్నారు

ఆలయాలను దర్శించుకున్న భక్తులు

వర్గల్‌లో నరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్,జూన్8: మండలంలోని నాచగిరి లక్ష్మీనరసింహస్వామి, వర్గల్ విద్యాసరస్వతీ మాత ఆలయాలు ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శనంకోసం క్యూలో బారులు తీరారు. వేసవి సెలవుల్లో చివరి ఆదివారం కావడంతో భక్తుల రాక ఉదయం నుంచే ప్రారంభమైంది. సరస్వతీ మాత సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. నాచగిరి నృసింహుడిని దర్శించుకునేందుకు ఉదయం భక్తులు తరలివచ్చారు. రెండు క్షేత్రాల నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

బొడ్రాయి అమ్మవారి వార్షికోత్సవాలు

మిరుదొడ్డిలో బొడ్రాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మిరుదొడ్డి, జూన్ 8 : మిరుదొడ్డిలో ఆదివారం బొడ్రాయి అమ్మవారి వార్షికోత్సవాలను గ్రామానికి చెందిన అన్ని కులాల వారు సామూహికంగా జరుపుకొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మాణిక్యాలను తీసి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

రేపు స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

సిద్దిపేట,జూన్ 8: జిల్లా సిమ్మింగ్‌పూల్‌లో ఈ నెల 10వ తేదీన సబ్- జూనియర్, జూనియర్ జిల్లా స్థాయి సిమ్మింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి బర్ల మల్లికార్జున్, గుండి ప్రవీణ్ తెలిపారు. ఈ పోటీల్లో ఫ్రీ స్టైల్ విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్లు,200 మీటర్లు, బటర్‌ఫ్లై విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, బెస్ట్‌స్టాక్ విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, బ్యాక్ స్ట్రోక్ విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల విభాగంలో ఎంపికలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన క్రీడాకారులు త్వరలో జరిగే ఏడో రాష్ట్రస్థాయి క్రీడలో పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సెల్: 9989 465 420, 9440978700 నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, ఈవెంట్‌కి రూ.100 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

డీబీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వేణు

గజ్వేల్, జూన్ 8: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని బెజుగామ గ్రామానికి చెందిన బ్యాగరి వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన 10వ మహాసభలో బ్యాగరి వేణును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను జిల్లా కార్యదర్శిగా నియమించిన జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

లంబాడీలకు చోటు కల్పించకపోవడం సిగ్గుచేటు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 8:రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు చోటు కల్పించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ గిరిజన నాయకుడు లకావత్ వెంకటేశ్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర గడుస్తున్నా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి లంబాడీల పట్ల చిన్నచూపు చూస్తున్నాడని, దీనికి నిదర్శనమే మంత్రివర్గంలో లంబాడీలకు చోటు కల్పించకపోవడమన్నారు. లంబాడీల ఓట్లతో గెలిచి మోసం చేస్తున్న సర్కార్‌కు రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

బాపురావుకు పరామర్శ

దుబ్బాక,జూన్ 8: దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌కు చెందిన న్యాయవాది బాపురావు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం అతడి కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. కార్యక్రమంలో దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బనాల శ్రీనివాస్, నాయకుడు సిద్ధిరాములు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

జగదేవపూర్, జూన్8: భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రె కిరణ్(27) ఐదేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని జగదేవపూర్‌లో నివసిస్తున్నాడు.అతడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో కొన్నిరోజులుగా భార్య కాపురానికి రావడంలేదు. భార్యకాపురానికి రావడం లేదని ఆదివారం మనస్తాపం చెందిన కిరణ్ తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు గజ్వేల్ సర్కారు దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నోటు పుస్తకాలు పంపిణీ

దుబ్బాక,జూన్ 8: మండల వనరుల కేంద్రంలో ఆదివారం పెద్దగుండవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ఉచిత నోటు పుస్తకాలను ఎంఈవో ప్రభుదాసు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం వసతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పెద్దగుండవెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మ రమేశ్ పాల్గొన్నారు.

ఆత్మకమిటీ చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి

దుబ్బాక,జూన్ 8:దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్‌గా గాంధారి నరేందర్‌